క్లుప్తంగా

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కోలేటి దామోదర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో నిర్మిస్తున్న నాగలింగేశ్వర స్వామి ఆలయపనులు పూర్తి కావొస్తున్నాయని, త్వరలోనే పీఠాధిపతులతో ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. రాగినేడులో సొంతఖర్చుతో నిర్మిస్తున్న ఆలయ పనులను సోమవారం పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై స్థానికులకు సూచనలిచ్చారు. రాగినేడు నాగలింగేశ్వరాలయం గొప్ప శైవక్షేత్రంగా విరాజిల్లుతుందని ఆయన తెలిపారు.

కారుణ్య నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలో మెడికల్ అన్‌ఫిట్‌తో ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను సోమవారం అందజేశారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు యువకులకు పోస్టింగ్‌లను పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ బిల్లులపై గ్రామస్తుల నిరసన



బిల్ కలెక్టర్‌ను పంపిస్తున్న గ్రామస్తులు

రామగుండం: విద్యుత్ బిల్లులతో పాటు అదనంగా వార్షిక వినియోగ డిపాజిట్ (ఏసీడీ) పేరిట అదనపు ఛార్జీల వసూలుపై అంతర్గాం మండలం విసంపేట గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. ఏసీడీ బిల్లులు రద్దు చేసిన తర్వాతనే సాధారణ విద్యుత్ బిల్లులు చెల్లిస్తామంటూ స్పష్టం చేస్తూ విద్యుల్ బిల్లులు వసూళ్లకు వచ్చిన బిల్ కలెక్టర్‌ను వాపస్ పంపించి నిరసన తెలిపారు. ప్రతీ నెల తమ ఇంటికి రూ.300 లకు మించదని, ఏసీడీ పేరిట మరో రూ.1600 చెల్లించాలని బిల్లులు రావడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతీ ఉద్యోగి లక్ష్య సాధనకు పాటుపడాలి

రామగుండం: విద్యుత్ ఉత్పత్తి విషయంలో కార్మిక సంఘాలకతీతంగా లక్ష్యసాధనకు పాటుపడాల్సిన అవసరం ఉందని బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ అన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.నర్సింగరావు, జాగటి శ్రీకాంత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు మల్లేశం, డి.శ్రీనివాస్, తదితరులున్నారు.

పెగడపల్లి వాసికి గౌరవ డాక్టరేట్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గట్టు శ్రీనివాస్‌ను గౌరవ డాక్టరేట్ వరించింది. కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేశ్ సహకారంతో డిపార్ట్‌మెంట్ అఫ్ సోషియాలజీలో భాగంగా తెలంగాణలోని ట్రైబల్స్ ఏరియాలో ఉన్నత విద్యా విధానంపై అధ్యయనం చేయగా శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా పెగడపల్లిలో గ్రామస్తులు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ నిర్మల, ఉప సర్పంచ్ సుకేందర్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జి పై ఫిర్యాదు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో రోడ్డును ఆనుకోని అక్రమంగా నిర్మించిన వేబ్రిడ్జిపై చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ డీఈ సయ్యద్ ఫక్రోద్దిన్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ సముద్రాల రమేశ్ తెలిపారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.



మంథని: బోనాల జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



కాల్వశ్రీరాంపూర్‌లో ముగ్గు వేస్తున్న సంచార మహిళలు



ధర్మారం: విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

ఘనంగా సంక్రాంతి సంబురాలు

మకర సంక్రాంతి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు జోరుగా సాగాయి. మహిళలు ఇళ్లముందు అందమైన రంగులు ముగ్గులు వేసి అలరించారు. వాకిళ్లలో గొబ్బెమ్మలు, నవధాన్యాలతో రంగుల రంగుల ముగ్గులు వేశారు. పిల్లలు గాలిపటాలు ఎగరేసి సంబురాల్లో మునిగితేలారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సంక్రాంతి బోనాల జాతరలో పాల్గొని పూజలు చేశారు. మహిళలు ఇళ్లల్లో ఘుమఘుమలాడే పిండివంటలు చేసి అందరికీ వడ్డించారు. పలుచోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కనుమ సందర్భంగా రైతులు తమ పశువులను పూజించారు. వేడుకల్లో ప్రజాప్రతనిధులు, నాయకులు పాల్గొన్నారు. - సాక్షి, నెట్‌వర్క్



ఓదెల: కనగర్తిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



సుల్తానాబాద్ లో బహుమతులు అందిస్తున్న కేసీఆర్ సేవాదళం నాయకులు

ప్రజలు సుభిక్షంగా ఉండాలి



పెద్దమ్మ తల్లికి బోనమెత్తిన ఎమ్మెల్యే దాసరి

కాల్వశ్రీరాంపూర్: ప్రజలు సుభిక్షంగా ఉండాలని పెద్దమ్మ తల్లిని ప్రార్థించినట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ కులస్తులు నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల్లో ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయరమణా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి, నాయకులు చేతి ధర్మయ్య, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచు శ్రీదేవి, రైతు సమన్వసమితి మండల అధ్యక్షుడు దేవయ్య, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజకొమురయ్య, సింగిల్‌విండో చైర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

ఓదెల: సంక్రాంతి పండుగ సందర్భంగా ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో ఎమ్మెల్యే దంపతులు ప్రదక్షిణలు చేయటంతో పాటు కొడెమొక్కులను సమర్పించుకున్నారు. ఆలయసిబ్బంది ఎమ్మెల్యే కుటుంబానికి మల్లికార్జునస్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గొట్టం మల్లయ్య, కొయ్యడ శంకర్ గౌడ్ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, కేడీసీసీబీడైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడుపారుపెల్లి గుణపతి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

చెక్కు అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన అడిచెర్ల మల్లేశం కు సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.1.50వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు.

పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎంపీపీ స్రవంతితో కలిసి ప్రారంభించారు.

ఇన్‌ఫిట్ క్రషర్ కన్వేయర్ టెక్నాలజీ అద్భుతం



ఓసీపీ-2 ను సందర్శించిన నవీన్ జిందాల్

రామగిరి: సింగరేణి సంస్థలో అత్యంత అద్భుతమైన సాంకేతికత గల టెక్నాలజీ 1994 నుంచే వినియోగించడం చాలా అద్భుతమని జిందాల్ స్టీల్ పవర్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్ నవీన్ జిందాల్ అన్నారు. సింగరేణి సంస్థ ఆర్జీ3 ఏరియా పరిధిలోని ఓసీపీ2ను ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. ఓపెన్ కాస్ట్‌లో ఇన్‌ఫిట్ క్రషర్ కన్వేయర్ టెక్నాలజీ అత్యంత అద్భుతంగా ఉందని ఆయన కితాబు ఇచారు. ఓపెన్ కాస్ట్2లో గల ఇన్‌ఫిట్ క్రషర్ కన్వేయర్ టెక్నాలజీ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల ద్వారా తిలకించారు. ఇన్‌ఫిట్ క్రషర్ కన్వేయర్ టెక్నాలజీ సాధక బాధకాలను, లాభనష్టాలను తెలుసుకుని ఆస్ట్రేలియా, మొజాంబియ దేశాల్లోని మాకంపనీ గనులలో ప్రవేశపెట్టేందుకు తన బృందంతో కలిసి వచ్చినట్లు ఆయన తెలిపారు. మాకు సహకరించిన సింగరేణి మేనేజ్‌మెంట్‌కు, ఆర్జీ3 జీఎం తన్నీరు వెంకటేశ్వరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోల్ ఇండియా మాజీ సీఅండ్ఎండీ అనిల్ కుమార్ ఝా, బృందం సభ్యులు కపిల్ ధగత్, ఓం ప్రకాష్, రాజేష్ బన్వాలా, ఏజీఎం(ఇఅండ్ఎం) ఎలీషా, ఏజీఎం (ఫైనాన్స్)శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఎలిగేడు: రెండో విడత కంటి వెలుగు రేపు మండల కేంద్రంలో ప్రారంభం కానున్నట్లు మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 08 నుంచి మే 31వ తేదీవరకు ఆయా గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ఓదెల: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కొలనూర్ డాక్టర్ సంజనేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కొలనూర్ పీహెచ్‌సీలో ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమాన్ని గురించి వివరించారు. కంటిలోపాలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలతో పాటు అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోసత్తిబాబు, ఆశ కార్యకర్తలు మణీంద్ర, సరిత పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లిరూరల్: కంటివెలుగు కార్యక్రమం అమలు కోసం అవసరమైనన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక ఐటీఐ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కమిషనర్ వెంట మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్ భిక్షపతి, ఎఎన్ఎం, ఆశావర్కర్ తదితరులున్నారు.

ఆహ్వానపత్రాలు పంపిణీ

రామగుండం: 20వ డివిజన్ పరిధిలో ఈనెల 19 నుంచి ఫిబ్రవరి రెండవ తేదీ వరకు కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మాధురి తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటా కంటి వెలుగు ఆహ్వానపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, డాక్టర్ చేరాలు, హెల్త్ అసిస్టెంట్ వడ్డెపల్లి సమ్మయ్య, ఏఎన్ఎంలు లక్ష్మి, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కరుల పాల్గొన్నారు.

దళిత,గిరిజనులపై దాడులు అరికట్టాలి

జ్యోతినగర్: దళిత, గిరిజనులపై దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న అమానుష దాడులను ప్రభుత్వం అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని రామగుండం ఇండస్ట్రియల్ ఏరియా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో మాట్లాడారు. నిజామాబాద్‌లో దళిత టీచర్‌పై జరిగిన దాడి అనాగరిక చర్య అని దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాటి మనిషిని మనిషిగా చూడలేని దుర్మార్గపు స్థితి నేడు కొనసాగుతోందని విమర్శించారు. . నేడు 17న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యాకూబ్, మల్లేశ్, నారాయణరెడ్డి, శ్రీకాంత్, సాంబయ్య, రవి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

తాగు నీటి సరఫరాలో అంతరాయం

గోదావరిఖని: గోదావరి నదిలో ఇంటెక్ వెల్ పంపుల మరమ్మతుల కారణంగా రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాలకు నీటి సరఫరాలో అంతరాయం కలగనుందని ఆర్జీ-1 జీఎం కె.నారాయణ తెలిపారు. ఇంటెక్‌వెల్‌లోని పంప్‌ల బ్రేక్‌డౌన్ మూలంగా ఆర్జీ-1,2,3 ఏరియాల్లోని కార్మిక వాడలకు మంచీనీరు సరఫరా ఇబ్బంది కలుగుతోందన్నారు. కార్మిక కుటుంబాలు సహకరించి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో గోడ గడియారాలు పంపిణీ

పెద్దపల్లిరూరల్: బహుజన సమాజ్‌పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదినం సందర్భంగా పెద్దపల్లిలో ఆదివారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో గోడ గడియారాలను పంపిణీ చేశారు. అంతకు ముందు బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి హనుమయ్య, కుమ్మరి సవిత, చంద్రశేఖర్, తోట వెంకటేశ్, శేషాద్రి తదితరులున్నారు.

లింగాపూర్‌లో వీడియో సాంగ్ షూటింగ్



రామగుండం: అంతర్గాం మండలంలోని లింగాపూర్‌లో సోమవారం గ్రామ సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి నిర్మాణ సారథ్యంలో 'మా ఊరు పునాది రాళ్లు' అనే వీడియో సాంగ్ షూటింగ్ చిత్రీకరణ ప్రారంభించారు. ఈ షూటింగ్‌ను గ్రామానికి చెందిన పెద్ద మనిషి కందుల నారాయణ కొబ్బరికాయ, క్లాప్ కొట్టి ప్రారంభించారు. షూటింగ్‌లో చిత్రకారులు గంగారపు వెంకటేశ్, కాసర్ల రాజేందర్, పులి శ్రీనివాస్, ఇరికిళ్ల రాజయ్య, గుర్రం రాజలింగు, ఎడిటింగ్ దూడం సతీశ్, కెమెరామెన్ పులి శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

'జనాభా లెక్కల సేకరణలో ప్రభుత్వాలు వైఫల్యం'

గోదావరిఖని: జనాభా లెక్కల సేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణన వెంటనే చేపట్టి కేటాయించిన బడ్జెట్ ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఎన్నికలకు ముందే లెక్కలు తేలితే సమీకరణలు మారిపోతాయనే భయం అధికార,ప్రతిపక్షాలకు పట్టుకుందన్నారు. బీసీల జన గణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఇరుగురాల సంతోష్, బాజ వెంకటేశ్వర్లు, కన్నం భానుచందర్, జీఎస్‌రావు, జనగాం లింగయ్య, జి.అఖిల్‌వర్మ పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారుల సంఘం మండల అధ్యక్షుడిగా రాజు



కుంట రాజు

ధర్మారం: మండల వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడిగా కుంట రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో సోమవారం వస్త్రవ్యాపారుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించిన తర్వత కమిటీని ఎన్నుకున్నారు. కుంట రాజు రెండోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెముజాల భద్రా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా గుడిమెల్ల సురేశ్, సంయుక్త కార్యదర్శిగా కదారి గంగాధర్, కోశాధికారిగా తుమ్మ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా గోనే దేవయ్య, సలహాదారులుగా సత్యనారాయణ, మనోహర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తనను సభ్యులు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో కో-ఆప్షన్ సభ్యుడు మృతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గొట్టం మల్లయ్య(60) సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు ఆయన మృతికి సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆప్త మిత్రుడిని కోల్పోయానని తెలిపారు. అనంతరం ఆయన పాడె మోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ దన్నాయక్ దామోదర్ రావు, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీశ్, కౌన్సిలర్లు ఎండీ రఫిక్, చింతల రాజు,దున్నపోతుల రాజయ్య, కుమార్ కిశోర్, ఎండీ మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పాలకుర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే చందర్ మాట్లాడారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ఆటలతో శారీరక ధారుడ్యం పెంపొంది స్నేహాభావం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నవీన్, పాలకుర్తి సర్పంచ్ దుర్గం జగన్, ఉపసర్పంచ్ మాదాసు సతీశ్, ఎంపీటీసీ దుర్గం కుమార్, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, మేడిపల్లి ప్యాక్స్ చెర్మన్ ప్రభాకర్, పార్టీ మండల అధికార ప్రతినిధి ముల్కల కొంరయ్య, వివిధ గ్రామాల టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరహాలో క్రికెట్ కోచింగ్ క్యాంప్



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: హైదరాబాద్ తరహాలో మంథనిలో రెండు పర్మినెంట్ క్రికెట్ కోచింగ్ క్యాంపులు, నెట్స్ ఏర్పాటు చేసి, ఒకరిద్దరు కోచ్‌లను నియమిస్తామని ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి శ్రీపాద క్రికెట్ టోర్నమెంట్ కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే నిధుల నుంచి మైదానంలో క్రీడాకారుల కోసం వాకింగ్ ట్రాక్ కోసం రూ. 10 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ప్లే గ్రౌండ్ నెట్స్ క్రికెట్ క్రీడ కు కావలసిన సామాగ్రిని ఏర్పాటుకు వారం రోజుల్లో క్యాంపు ఏర్పాట్లను పరిశీంచనున్నట్లు తెలిపారు. పోలీస్ ఈవెంట్లలో అర్హత సాధించిన ఉద్యోగార్థుల కోసం హై దరాబాద్ నుంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను తీసుకువచ్చి మళ్లీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు.

క్రికెట్ పోటీల్లో విన్నర్‌గా ఆటాక్ విలన్స్ టీం, రన్నర్ గా బోయిన్‌పెట్ -11టీం గెలుపొందారు. విజేతలకు లక్ష రూపాయలు, ట్రోఫీ, రెండో బహుమతి రూ. 50 వేల నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా బీరన్న ఉత్సవాలు



బీరన్న ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

ఓదెల: మండలంలోని గూడెంలో సంక్రాంతి సందర్భంగా బీరన్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కురుమ కులస్తులు, మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులతో నెత్తిన బోనాలను ఎత్తుకొని మొక్కులను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొవిందుల ఎల్లస్వామి, కులపెద్దలు వీరముష్టి రాజ కొమురయ్య, నరిగే ఓదెలు, బీరయ్య, కుమారస్వామి లు పాల్గొన్నారు

వైభవంగా శ్రీమల్లికార్జునస్వామి లగ్నపట్నం

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ఒగ్గు పూజారులు మల్లికార్జునస్వామి కేతమ్మల లగ్నపట్నాన్ని వేసి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. 18న నాగవెల్లి పట్నం అన్నదానం ఉంటుందని ఆలయకమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలి

జూలపల్లి: నేత కార్మికులు ఆర్థిక, రాజకీయ రంగాలతోపాటు నూతన సాంకేతికతను ఉపయోగించుకుని తాము చేసే పనిలో రాణించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ సూచించారు. మండల కేంద్రంలో జిల్లా పద్మశాలి సంఘ సభ్యత్వ గుర్తింపు కార్డులను జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి కలిసి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, యూత్ అధ్యక్షుడు రమేశ్, అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామగిరి: మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇనుముల రమేశ్ తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అయితే ఇప్పటి వరకు 15 సార్లు సమావేశాలు నిర్వహించగా వీటిలో సమస్యల పరిష్కారం కోసం చర్చించింది లేదు, ముఖ్యమైన తీర్మానాలు చేసింది లేదని సభ్యులు వాపోతున్నారు. ఈ సమావేశమైనా సజావుగా సాగుతుందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.